## కామెడీ కథ

# పిచ్చాపాటీ వారింట్లో పెళ్ళి

**భమిడిపాటి సోమయాజి**

**పిచ్చాపాటీ పిచ్చేశ్వరరావు కుమార్తె పిచ్చమ్మకి పెండ్లీడు వచ్చింది. ఒక సంబంధం నిశ్చయమయింది. ఈ పిచ్చాపాటీ వారింట్లో గంటల తరబడి మాట్లాడుతూం టారు. ఏ విషయం ఛస్తే తేలనివ్వరు! పోనీ విషయం పూర్తిగా మునిగిపోతుందంటే అదీ జరగదు!**

మూడు నాలుగుసార్లు పిచ్చాపాటీ వారితో మాట్లాడిన తర్వాత మగపెళ్లివారు వీళ్ల గొప్పతనం తెలుసుకున్నారు. మగపెళ్లివారి ఇంటి పేరు గడుసుపాటి వారు.

పిచ్చాపాటీవారు సంబంధం కుదుర్చుకునేటప్పుడు మాట్లాడి మాట్లాడి కాలయాపన చేశారు. ఇదే అదునని చెప్పి ఇంకో సంబంధం వచ్చిందనీ వాళ్లు రెండు లక్షలు కట్నం ఇస్తామన్నారనీ చెప్పి లక్ష రూపాయలకి మొదట్లో ఒప్పుకుందామనుకున్న కట్నం రెండు లక్షలకి పెంచేశారు. అప్పుడు పిచ్చాపాటివారి వంశస్థుడు ఒకతను అన్నాడు. ''మన పూర్వీకుల్లా ఎక్కువసేపు పిచ్చాపాటీలో మనం కూడా మునిగిపోతే ఇలాగే అవుతుంది!''

''డబ్బు పోతే పోతుంది! మనం పిచ్చాపాటీ విషయంలో పూర్వ సాంప్రదాయం పాటించకపోతే పితృదేవతలు దుఃఖంతో పరితపిస్తారు. మనం పెట్టే తద్దినాలు వాళ్లకి ముట్టవు!'' అన్నాడు ఇంకొక పిచ్చాపాటీ వంశస్థుడు.

''సరే వంశ పరంపరా మర్యాద కాపాడవలసిందే'' అనే నిర్ణయానికి వచ్చారు.

పెళ్లి విందుకి మగపెళ్లివారి తరపున అయిదు వందల మంది వస్తామన్నారు. ఆడపెళ్లివారు అంకె ఖాయమే కదా అంటూ మగపెళ్లి వారింట్లో కూర్చుని తమ సహజసిద్ధమైన పిచ్చాపాటీ మొదలుపెట్టారు. ఈ లోపులో ఒక పెద్దాయన పంచీ కండువా వేసుకుని వచ్చాడు. పెళ్లివారు మొత్తం ఎంతమందని చెప్పారని ఆ పిల్లాడి తండ్రిని అడిగి, అయిదు వందల మందని తెలుసుకుని ''గడుసుపాటి వారికి సిగ్గుచేటు'' అంటూ కనీసం ఎనిమిది వందల దాకా అంకెని పెంచమన్నాడు. పిచ్చాపాటీలో పడకపోతే అయిదు వందల మందితో పోయేదేమో!

★ ★ ★

''పిచ్చాపాటీ వారి పెండ్లి పిలుపు'' అని ఆహ్వాన పత్రికల మీద అచ్చు వేయించారు. వీళ్లు శుభలేఖలిద్దామని వచ్చినప్పుడు వీళ్ల విషయం తెలిసిన వాళ్లు చాలామంది ఇంట్లో ఉండీ లేమని చెప్పించారు.

పిలుపులకి వెళ్లిన ప్రతీచోట పెండ్లికూతురు పిచ్చమ్మకి ఎన్ని పట్టు చీరలు కొంటున్నారో చెప్పేవారు. అసలే పిచ్చమ్మది పిచ్చివాలకం కనుక పట్టుచీరల్లో ఆ పిచ్చి వాలకం కప్పేద్దామని చూస్తున్నారు- అనుకున్నారు కొంతమంది ఆహ్వానితులు. వెళ్లిన చోటల్లా పెండ్లి పత్రికలు ఇవ్వడంలో చాలా టైమ్ వృధా అయిపోయి ఒక మంచి బట్టల కొట్లో ఇచ్చే రిబేట్ పోగొట్టుకున్నారు ఆడపెళ్లివారు. తర్వాత ఇంకో బట్టల కొట్టుకి వెళ్లి ఆ షాపు వాళ్లని కూడా వీళ్ల ధోరణిలోకి దింపి, వాళ్లని ఊదరగొట్టి అక్కడ అసలు రిబేట్ లేకపోయినా రిబేట్ తీసుకున్నారు. ఆ షాపువాళ్లు తేరుకుని మళ్లీ అసలు ధరలు వసూలు చేశారు. అది వేరే విషయం. ముందు వీళ్ల చేతుల్లో దెబ్బతిన్నారా లేదా అన్నదే ముఖ్యం.

అచ్చమాంబగారింటికి శుభలేఖ ఇవ్వడానికి వెళ్లి బోల్డు పిచ్చాపాటీ నడిపించారు.

''పిచ్చమ్మ ఇరవై ఏళ్ల వయసులో కూడా తాడాట ఆడేదనీ, ఒకసారి మడవ దగ్గర చిట్లడం వలన ఇప్పటికీ కొద్దిగా సరిగ్గా నడవలేదనీ, అయినా పిచ్చి మగపెళ్లివారు తెలుసుకోలేకపోయారనీ'' చెప్పారు.

వాళ్లు వెళ్లిన తర్వాత అచ్చమాంబగారి చుట్టం ''ఈ పిచ్చాపాటీ వారి స్వస్థలం ఎక్కడని'' అడిగాడు.

ఇచ్ఛాపురం అని చెబితే ''ఇచ్ఛాపురం అయి ఉండదు పిచ్చాపురం అయి ఉంటుందనీ'' హాస్యమాడాడు. ''పైగా మగపెళ్లివారు పిచ్చి వాళ్లు అంటున్నారు ఈ పిచ్చాపాటీ వాళ్లు. వియ్యమైనా, నెయ్యమైనా సముజ్జీల మధ్యే కదా'' అన్నాడో గడుసుపాటి వారు. బంగారం ధర అస్తమానూ పెరుగుతోందని, ఏభై వేలు ఇచ్చేసి ఎనిమిది తులాలు బంగారపు వస్తువులు- తమ తరపున చేయించమన్నారు. ఈ బంగారం వస్తువులు వెంటనే పురమాయిస్తే బాగుండేది. ఎక్కడ పడితే అక్కడ వాళ్ల సహజ ధోరణిలో పడి అసలు విషయంలో ఆలస్యం చేశారు. బంగారం ధర పెరిగిపోయి ఎక్కువయిన ఖర్చు ఆడ పెళ్లివారి నెత్తిన పడింది. ఎంత నష్టమొచ్చినా ఫర్వాలేదు పిచ్చాపాటీ నడిపించి వంశమర్యాద కాపాడాలని మళ్లీ తీర్మానించాడు.

★ ★ ★

ఆడపెళ్లివారి దెబ్బ తట్టుకోలేమని తెలిసిన కొందరు పెళ్లికి రాలేదు. తప్పక వచ్చినవాళ్లు తెలివిగా పెళ్లిమండపం అలంకరణ బాగుందనీ దీపాలు దేదీప్యమానంగా ఉన్నాయనీ, చెప్పి తప్పించుకుని బ్రతికిపోయారు.

పిచ్చమ్మ మేనమామ పెళ్లికూతుర్ని బుట్టతో తీసుకొస్తూ మధ్యలో ''బుట్ట ఒకసారి దింపవచ్చా!'' అని అడిగాడు. ఆ బుట్టతో పాటున్నవారు ''పిచ్చమ్మ పిచ్చ బరువుందా!'' అన్నాడు.

వెంటనే ఇంకొకరెవరో అదేం జోక్ కాదన్నారు. పిచ్చమ్మ మేనమామకి ఏదైనా జోక్‌కి నవ్వేటప్పుడు చప్పట్లు కొడుతూ నవ్వుతాడు. జోక్ కాదనడం వలన బుట్ట వదిలెయ్యలేదు. లేకపోతే బుట్ట వదిలేసి చప్పట్లు కొట్టడం పిచ్చమ్మ భూమ్మీద పడడం జరిగి ఉండేవి. పెళ్లికూతురు అదృష్టవంతురాలు!

పెళ్లికి చదివింపుల సమయానికి ముందు పిచ్చమ్మ మేనమామ తన బావగార్ని పిలిచి ''నువ్వేమనుకోకపోతే ఓ విషయం చెపుతాను బావా

మొన్న ఒక పెళ్లికెళ్లినప్పుడు చూశాను పెళ్లికూతురు బంధువులంతా కలిసి కుమ్మక్కై పెళ్లికూతురికి ఎక్కువ కట్నాలు చదివించారు. అది చూసి పైవాళ్లు తక్కువ చదివిస్తే బాగుండని ఎక్కువ డబ్బు కట్నం కింద చదివించారు. అందుకని మన చుట్టాలంతా రెండేసి వేలు మూడేసి వేలు చొప్పున పిచ్చమ్మకి చదివిద్దాం. అది చూసి మిగిలిన వాళ్లు తక్కువ పెళ్లి చదివింపులు చదివిస్తే బాగుండదని ఎక్కువ ఎక్కువ చదివిస్తారు.

రేపొద్దున్నే మనవాళ్లు అసలెంత చదివిద్దామ



నం
కున్నారో అంతా తీసుకుని మిగిలిన డబ్బు ఎవరిది వాళ్లకి ఇచ్చేద్దాం''

''హోర్నీ మాకు మీ అక్కయ్యని ఇచ్చిన తరువాత మా తెలివితేటలన్నీ మీక్కూడా వచ్చాయి'' అని గట్టిగా బావమరిది వీపు మీద పిచ్చి దెబ్బ ఒకటి కొట్టాడు. అలా ఎక్కువ చదివించిన డబ్బు పొద్దున్నే ఎవరిది వారికిచ్చే బాధ్యత పిచ్చేశ్వరరావు బాబయ్యకి అప్పజెప్పారు. రాత్రి తెల్లవార్లూ పెళ్లి కార్యక్రమం జరుగుతూనే ఉంది. పిచ్చాపాటీ కార్యక్రమం సరేసరి.

తెల్లారింది అప్పగింతలయిపోయాయి. పొద్దున్నే ఎక్కువ చదివించిన వాళ్లు వాళ్ల డబ్బు వాపస్ ఇస్తే ప్రయాణమై వెళ్లిపోతామన్నారు. విడిగా పెట్టిన ఆ డబ్బు సంచీ కనపడలేదు. ''వాళ్ల బాబయ్యదే బాధ్యత'' అన్నాడు పిచ్చమ్మ మేనమామ.

''రాత్రి పెళ్లి భోజనాలైన తర్వాత నా చేత బోల్డు మాటలు చెప్పించారు. అంచేత ఆ డబ్బు సంచీ మీద నా మనస్సు లగ్నం కాలేదు'' అన్నాడు పిచ్చేశ్వరరావు బాబయ్య. ''అసలీ దరిద్రపు సలహా ఇచ్చిన పిచ్చమ్మ మేనమామే ఈ నష్టం భర్తీ చేయాలని'' చాలా మందన్నారు.

పెళ్లికూతురు తల్లి ఏడుపుతో ''అసలు మా తమ్ముడు మంచి ఉద్దేశ్యంతో సలహా ఇస్తే వాడ్ని డబ్బు తెమ్మనడం ధర్మమా! పైగా అసలు ఎప్పుడు పడితే అప్పుడు ఈ పిచ్చాపాటీ వద్దంటే, వంశమర్యాద వంశమర్యాద అని పిచ్చి పిచ్చిగా మాట్లాడేరు.

ఇప్పుడు చుట్టాలకి డబ్బు ఇవ్వకపోతే వంశ మర్యాద పోదా!'' అని తన పెళ్లయినప్పట్నుంచీ విసిగిపోయిన పిచ్చమ్మ తల్లి, ఏదైనా అనడానికి ఇదే మంచి సమయం మించినన్ దొరకదు, అని గట్టిగా అరిచింది.

పిచ్చమ్మ మేనమామ ఒక వంతూ, పిచ్చేశ్వరరావు రెండు వంతులూ, వాళ్ల బాబయ్య ఒక వంతూ వేసుకుని ఎవరి డబ్బు వాళ్లకిచ్చేసి చుట్టాలని సాగనంపారు.

పిచ్చాపాటీ వారింట్లో పెళ్లికి ఇకపై ఛస్తే రాకూడదని చుట్టాలంతా పలాయనం చిత్తగించారు.